ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి

5

ములుగు

శుక్రవారం 6 సెప్టెంబరు 2024



నేడు ములుగుకు ఈటల రాజేందర్

గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో ముంపు ప్రాంతాల పరిశీలన

ములుగు, సెప్టెంబరు 5: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం ములుగు జిల్లా పర్యటనకు వస్తున్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ తెలంగాణ శాసన సభపక్ష నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో భారీ వర్షాలు, వరదల ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం తెలిపారు. ముంపునకు గురైన పంటలతోపాటు సుడిగాలులకు దెబ్బతిన్న తాడ్వాయి అడవులను సందర్శిస్తారని వెల్లడించారు.

వరహాల గుట్టకు మహర్దశ



వరహాలగుట్టపైకి దారిని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, రేంజర్ శంకర్, సిబ్బంది

రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో ఉన్న వరహాలగుట్టలో ఏముందో ఇంతకాలం ఎవరికీ తెలియదు. దూరం నుంచి చూస్తే అది ఓ కొండ మాత్రమే. పైకి ఎక్కితే మాత్రం దాని విలువేంటో అర్థమవుతుంది. ఇటీవల కాలంలోనే ఆ గుట్ట పైభాగంలోని అద్భుతాలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఇంకేముంది దాన్ని పర్యటక కేంద్రంగా మార్చాలని ప్రణాళికలు రూపొందించారు. ఈనెలాఖారుకు వరహాలగుట్ట పైభాగాన పర్యాటకుల కోసం 50గుడారాలు, ఆ గుడారాల ముందు భాగంలో గుడారాల ముందు కూర్చొని ప్రకృతి అందాలను ఆస్వాదించేలా కట్టేలతో మంటలు (క్రాఫ్ట్ ఫైర్స్)తో ఏర్పాటు చేస్తున్నారు. ములుగు జిల్లాలో మరో ప్రకృతి రమణీయ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందబోతున్న వరహాల గుట్ట గురించి 'ఆంధ్రజ్యోతి' కథనం.

- వెంకటాపూర్ (రామప్ప)

వివరాలు 7వ పేజీలో..



- ములుగు జిల్లాలో మరో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- కాకతీయుల కాలంనాటి ఆనవాళ్లు గుర్తింపు
- త్వరలో గుట్టపై 40 గుడారాలు.. క్రాఫ్ట్ ఫైర్ ఏర్పాటు
- రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కొత్త శోభ

వరహాల గుట్ట

అస్తవ్యస్తం.. అధ్వానం



భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామంలో చెత్తా చెదారం పేరుకపోయి నిండిపోయిన డ్రైనేజీ

◆ పల్లెల్లో లోపిస్తున్న పారిశుధ్య నిర్వహణ ◆ పేరుకుపోతున్న వ్యర్థాలు

◆ నిండిపోతున్న డ్రెయినేజీలు ◆ పట్టించుకోని యంత్రాంగం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), అక్టోబరు 5: పల్లెల్లో పారిశుధ్యం లోపిస్తోంది. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో చెత్తాచెదారం, మురుగునీరు పేరుకుపోతోంది. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. అసలై వర్షాకాలం.. ఆపై పారిశుధ్య లోపం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో చాలా మంది సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. ఒకవైపు వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, మరోవైపు పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో రోగాలు విస్తరిస్తున్నాయి. గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. పారిశుధ్యం లోపించడం వల్ల చాలా మంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాల బారిన పడుతున్నారు.

పాలకులు లేరు.. ప్రత్యేకాధికారులూ రారు..

పంచాయతీల కాలపరిమితి జూలై 5న ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో పాలవర్గాలు లేవు. దీంతో ప్రజాప్రతిధులు మాజీలయ్యారు. దీంతో పల్లెల్లోని సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. ప్రత్యేకాధికారులుగా నియామకం పొందిన వారు విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని తెలుస్తోంది. ఒక్కో ప్రత్యేకాధికారికి రెండు, మూడు గ్రామాలను కేటాయించడంతో పూర్తి స్థాయిలో నిర్వహణ జరగడం లేదు. దీంతో పెద్దగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులంతా ఓటరు జాబితా సవరణల కార్యక్రమంలో నిమగ్నం కావడంతో పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. అలాగే చెత్తను సేకరించే కార్మికులకు సకాలంలో వేతనాలు అందడం లేదని తెలుస్తోంది. ఈ పరిణామాలు గ్రామాల్లో పారిశుధ్య లోపానికి దారి తీస్తున్నాయి. చెత్తను సేకరించడం, మురుగు కాల్వలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం తదితర పనులు సక్రమంగా సాగడం లేదని తెలుస్తోంది. వీటన్నింటికీ తోడు గ్రామ పంచాయతీకి వచ్చే నిధులకు బ్రేక్ పడటం కూడా శాపంగా మారింది.

కనీసం బ్లీచింగ్ చల్లడం లేదు

- స్వరూప, కొంపెల్లి (భూపాలపల్లి మండలం)



వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉంటున్నాయి. డ్రెయినేజీలో మురుగునీరు పేరుకపోయి రోడ్లపైకి చేరి దుర్వాసన వస్తోంది. అయినప్పటికీ కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించడం లేదు. దీంతో దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నాం. మా బాధను ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి



కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్, సెప్టెంబరు 5 : మండలంలోని కాళేశ్వరం వద్ద గురువారం గోదావరి మళ్లీ పెరిగింది. త్రివేణి సంగమం వద్ద నాలుగు రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకల ద్వారా వరద నీరు గురువారం గోదావరిలోకి చేరింది. దీంతో ఉదయం 11.4 మీటర్ల నీటిమట్టం నమోదైంది. 13 లక్షల క్యుసెక్కుల నీరు బ్యారేజీ వైపు ప్రవహించాయి.

తుపాకులగూడెంలో..

కన్నాయిగూడెం: మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి మళ్లీ నెమ్మదిగా పెరగుతూ వస్తోంది. బుధవారం ఉదయం వరకు పెరుగుతూ వచ్చిన గోదావరి సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. గురువారం సాయంత్రం వరకు 6,65,870 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నిలకడగా ప్రవహించింది. సాయంత్రం 6 గంటల నుంచి మళ్లీ పెరుగుతూ ఉంది. ఎగువ నుంచి 6,78,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని అన్ని గేట్లు ఎత్తి, వచ్చిన వరద నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి సామర్థ్యం 83 మీటర్లు కాగా ప్రస్తుతం 81.60 మీటర్లు నమోదైనట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు

కోర్టుకు హాజరుకాని కేసీఆర్, హరీశ్‌రావు

మిగతా ఆరుగురు కూడా గైర్హాజరు

'మేడిగడ్డ' కేసు వచ్చే నెల 17కు వాయిదా

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 5: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీబ్యారేజీ కుంగిపోవడానికి అవినీతే కారణమంటూ జయశంకర్ భూపాలపల్లికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి దాఖలు చేసిన ప్రైవేటు పిటిషన్‌పై గురువారం భూపాలపల్లి జిల్లా కోర్టు విచారణ నిర్వహించింది. ఈ కేసులో ప్రతివాదులుగా పేర్కొన్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు రజత్‌కుమార్, స్మితసబర్వాల్, ఇంజనీరింగ్ అధికారులు హరిరాం, ఎన్.శ్రీధర్, మేగా కంపెనీ అధినేత కృష్ణారెడ్డి, ఎల్అండ్‌టీ కంపెనీ జనరల్ మేనేజర్ సురేష్ కుమార్‌ను సెప్టెంబరు 5న హాజరవ్వాలని పేర్కొంటూ గతనెల 3న భూపాలపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. కానీ గురువారం హరీశ్‌రావు తరఫున హుజూరాబాద్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది లలితారెడ్డి, స్థానిక న్యాయవాది వేశాల రవీందర్, మెగా కృష్ణారెడ్డి, రజత్‌కుమార్, సురేష్ కుమార్ తరఫున సుప్రీంకోర్టు అడ్వకేట్ అవధాని, స్థానిక అడ్వకేట్ శ్రావణ్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ల తరఫున అడ్వకేట్ హరిరాం, శ్రీధర్ తరఫున వరంగల్ అడ్వకేట్ నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ క్రమంలో కేసును వాయిదా వేయాలంటూ నిర్మాణ సంస్థ, ఇంజనీర్ల తరఫున హాజరైన న్యాయవాదులు కోర్టును అభ్యర్థించారు. దీంతో జిల్లా జడ్జి నారాయణబాబు ఈ కేసును అక్టోబరు 17వ తేదీకి వాయిదా వేశారు.

కేసులో రాజీ పడేదిలేదు : పిటీషనర్ రాజలింగమూర్తి

మేడిగడ్డ బ్యారేజీలో చోటుచేసుకున్న అవినీతి కేసులో రాజీ పడేది లేదని పిటీషనర్, సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి తేల్చి చెప్పారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై న్యాయపోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనను వెలువరించారు. రూ.35 వేల కోట్ల ప్రాజెక్టుకు రూ. లక్ష 35 వేల కోట్ల వ్యయం పెంచి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఆ నిధులను మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు ఆరుగురు అధికారుల నుంచి రికవరీ చేసే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. న్యాయస్థానంపై ఎంతో గౌరవం ఉందని, ఈ అక్రమాలపై తప్పక చర్యలు ఉంటాయనే నమ్మకం కూడా ఉందని పేర్కొన్నారు.

విజయవాడ వరదల్లో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మహాముత్తారం, సెప్టెంబరు 5: విజయవాడ వరదల్లో గల్లంతైన మహాముత్తారం మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన బీసుల లక్ష్మీరాజు (19) మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బుధవారం వెలికితీయగా కుటుంబ సభ్యులకు అక్కడి అధికారులు సమాచారం అందించారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో కాంగ్రెస్ నాయకులు దుర్గయ్య, మధుకర్, లక్ష్మయ్య, రవీందర్, రజాకార్, ప్రసాద్‌తో కలిసి కుటుంబ సభ్యులు విజయవాడకు వెళ్లారు. లక్ష్మీరాజు మృతదేహాన్ని అక్కడి అధికారులు అప్పగించగా గురువారం స్వగ్రామానికి తీసుకొచ్చారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి



రాజు(ఫైల్)

కాటారం, సెప్టెంబరు 5: ప్రమాదవశాత్తు చెరువులో పడి పశువుల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై అభినవ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతాపగిరి గ్రామపంచాయతీ పరిధి మద్రిపల్లికి చెందిన ననుబోతుల రాజు(25) పశువుల కాపరిగా పనిచేసేవాడు. తండ్రి మృతి చెందడంతో తల్లి మల్లక్కతో కలిసి గ్రామంలో నివసిస్తూ వ్యవసాయ పనులకూ వెళ్లేవాడు. గురువారం ఎప్పటిలాగే గేదెలను తోలుకుని దేవుని చెరువు వైపు వెళ్లాడు. కొన్ని గేదెలు చెరువులోకి వెళ్లగా వాటిని బయటికి వెళ్లగొట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో గల్లంతయ్యాడు. చెరువు వద్ద ఉన్న కొందరు గమనించి పోలీసులు, రాజు బంధువులకు సమాచారం ఇచ్చారు. పలువురు ఈతగాళ్ల చెరువులో వెతకగా రాజు మృతదేహం లభించింది. చెట్టంత కొడుకు దుర్మరణం పాలవడంతో తల్లి మల్లక్క కన్నీరుమున్నీరుగా విలపించింది. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయులే భవిష్యత్ నిర్మాతలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 5: విద్యార్థుల భవిష్యత్తును నిర్మించేది ఉపాధ్యాయులే అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం గురువారం జరిగింది. కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను పదో తరగతిలో ఉన్నప్పుడే ప్రజా సేవ చేయాలనే సంకల్పం ఉండేదని అన్నారు. ఇది చూసిన తన గురువు కృష్ణయ్య తాను రాజకీయ నాయకుడవుతానని కాంక్షించారని గుర్తు చేసుకున్నారు. ఆయన చెప్పిన మాటే నిజమైందన్నారు. ఉపాధ్యాయులు మనకు నేర్పిన ఓనమాలు మన గుండెల్లో సువర్ణాక్షరాలతో రాసి ఉంటాయన్నారు. ఆ రాతలే మన జీవితానికి బాటలు వేస్తాయన్నారు. నేటి ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్‌గారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం రూ. 10కోట్లు కేటాయిస్తే, వాటిలో రూ. 3.70 కోట్లను గురుకులాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు పొందిన ఉపాధ్యాయులతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ



ములుగు కలెక్టర్ దివాకరతో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా దిద్దాలి : ములుగు కలెక్టర్

ములుగు కలెక్టరేట్ : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులకు మంచి బోధన చేయడంతోపాటు విషయ పరిజ్ఞానం నేర్పించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి మరో పది మందికి సహాయం చేస్తారని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల విషయంలో సత్ప్రవర్తనతో ఉండాలని, విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో ఓపికతో మంచి విషయాలు నేర్పించాలన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు 15 మందిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యాచార దోషిని శిక్షించాలి

బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి

ఆసిఫాబాద్ ఘటనపై జాతీయ రహదారిపై రాస్తారోకో

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 5: ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ బిడ్డపై అత్యాచారానికి పాల్పడిన దోషిని శిక్షించాలని బీజేపీ అనుబంధ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నామవరపు విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ బీజేపీ మోర్చా ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోకుండా కేసును వక్రీకరించేందుకు ఆదివాసీ మంత్రి సీతక్క ప్రయత్నించారని ఆరోపించారు. ఎంఐఎంకు కాంగ్రెస్ తొత్తుగా మారి కేసును తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. అత్యాచార దోషిని శిక్షించాలని, బాధిత కుటుంబానికి రూ. కోటి పరిహారం అందించాలన్నారు. నిందితుడికి శిక్షపడకుంటే మంత్రి సీతక్క తన పదవికి రాజీనామా చేసి ఆదివాసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండెపల్లి సత్యం మాట్లాడుతూ మహిళల భద్రతను రేవంత్ సర్కార్ గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. బీజేపీ శ్రేణుల రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ఎస్సై తాజుద్దీన్ అక్కడికి చేరుకొని నేతలతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. రాస్తారోకోలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల రాంబాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు లోడే శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు పల్లా బుచ్చయ్య, ఈక మహలక్ష్మి, గడ్డం సత్యం, గాడిచర్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీజేపీ శ్రేణులు

గంజాయి రవాణా కేసులో ఇద్దరు అరెస్టు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 5: గంజాయి రవాణా కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలోని తన చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం గణపురం మండలం రవినగర్ గ్రామం వద్ద ఎస్సై అశోక్ నేతృత్వంలో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా ఆటోలో కనిపించారన్నారు. వారిని ఆపి తనిఖీ చేయగా ఆటో సీటు కింద కవర్లో రెండు కిలోల గంజాయి లభ్యమైంది. వారిని గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన రాములు, ఇదే గ్రామానికి చెందిన నిశాంత్ అని గుర్తించారు. కొద్ది రోజులుగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలోని కొండ పరీవాహక ప్రాంతంలో రమేష్ అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి భూపాలపల్లి, గణపురం మండల పరిసర ప్రాంతాల్లో అలవాటు ఉన్న వారికి అందిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి నియంత్రణకు ప్రజలు సహకరించాలని, పూర్తి స్థాయిలో ఈ మహమ్మారిని నిర్మూలించేందుకు పోలీసులు ఎళ్లవేళలా కష్టపడుతున్నారని పేర్కొన్నారు. గంజాయికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు గానీ, డయల్100కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో చిట్యాల సీఐ మల్లేష్, ఎస్సై అశోక్, సిబ్బంది రాజు, నేతాజీ, శ్రీనివాసులు, యూకేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

బయ్యారం, సెప్టెంబరు 5 : వరద బాధితులకు గురువారం పోలీసులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని వట్టివాగు ప్రవాహంతో మొట్లతిమ్మాపురం గ్రామానికి వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఎస్పీ ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్ కేకన్ ఆదేశాలతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి నేతృత్వంలో బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతితో పాటు పోలీస్ సిబ్బంది జేసీబీ వాహనం ద్వారా వాగుదాటి మొట్లతిమ్మాపురం గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు, కురగాయలు పంపిణీ చేశారు. దాదాపు ఒక ట్రాక్టర్ నిండా సరుకులు తీసుకెళ్లి గ్రామ ప్రజలకు అందజేశారు. కొద్ది రోజులుగా తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పోలీసులు సరుకులు పంపిణీ చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అనిల్, సతీష్, రజిని, కోటేశ్వర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బయ్యారంలో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పోలీసులు



వరంగల్ పోతననగర్‌లోని మోడ్రన్ దోబీఘాట్



వాషింగ్ మిషన్లు, ఐరన్ బాక్స్ టేబుళ్లు

మోడ్రన్ దోబీఘాట్‌పై పట్టింపేదీ?

- నిరుపయోగంగా పోతననగర్ దోబీఘాట్
- కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- నిరుపయోగంగా విలువైన సామగ్రి
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం
- నిర్వహణ బాధ్యతపై ఎటూ తేల్చని అధికారులు
- రజక సంఘాలకు అప్పగించాలని డిమాండ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 5: అట్టహాసంగా ప్రారంభించిన వరంగల్ మోడ్రన్ దోబీఘాట్(ల్యాండ్రో మార్ట్) పది నెలలకే పనులకు నోచుకోకుండా పోయింది. పనులు మొత్తం పూర్తయినా బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో ఎక్కడి పనులక్కడే అన్నట్టు విమర్శలు వస్తున్నాయి.

అధునాతన రీతిలో..

వరంగల్ పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్ అధునాతన సాంకేతికతతో రూపుదిద్దుకుంది. స్మార్ట్‌సిటీ నిధుల కింద ముందుగా రూ.1.10 కోట్లు మంజూరు చేయగా, తర్వాత మరో రూ.కోటితో మెట్టుతో పాటు అక్కడ అన్ని సౌకర్యాలు, ప్రత్యేక పవర్ ట్రాన్స్‌ఫార్మ్‌ను ఏర్పాటు చేశారు. పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్‌కు ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు బల్దియా అధికారులు వెల్లడించారు. అందులో 30కిలోల వాషింగ్ మిషన్లు 9, 15కిలోల స్పిన్ మిషన్లు 9, 30కిలోల డ్రై మిషన్లు 12, 10 టేబుళ్లపై ఆర్‌వో స్ట్రీం వాటర్ టెక్నాలజీతో నడిచే 10 ఐరన్ బాక్సులతో పాటు పెద్ద పెద్ద టబ్బులు, కెమికల్ స్టోరేజ్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఇంకా మోడ్రన్ దోబీ మిషన్లు, శారీ రోలింగ్ మిషన్లు, బెడ్‌షీట్ ఏరస్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఈ మిషన్ల ద్వారా డ్రైక్లీనింగ్, డ్రైవాష్, స్ట్రీం ఐరన్ వాష్, నార్మల్ వాష్, స్పిన్ వాష్, కెమికల్ వాష్, నాచురల్ వాష్‌ల పద్ధతిలో అన్ని రకాల బట్టలు శుభ్రం చేయవచ్చని తెలిపారు.

ఏకతాటిపైకి కుల సంఘం నాయకులు

వరంగల్ నగరంలో రజకుల అభివృద్ధి కోసం మోడ్రన్ దోబీఘాట్ ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో రజకులైన ప్రతీ ఒక్కరు సభ్యులుగా ఉండవచ్చని ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు తెలిపారు. ముందుగా ప్రాంతాల వారీగా ఉన్న రజక సంఘాల నాయకులను ఏక తాటిపైకి తెచ్చి తర్వాత వరంగల్ ట్రైసిటీస్ సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు 500 నుంచి 600 మంది వరకు సభ్యులుగా చేర్చుకుని మడేలయ్య మోడ్రన్ దోబీఘాట్ సొసైటీగా ఏర్పడ్డారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఒకరికొకరు చేరవేసుకుంటున్నారు. బస్వరాజు సారయ్యను సంఘానికి ముఖ్య సలహాదారుడిగా చేసుకుని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల నుంచి ఇద్దరు, ముగ్గురి చొప్పున తీసుకుని పెద్ద సంఘంగా ఏర్పడ్డారు. అయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో నివసించే రజక కార్మికులు.. చేసిన పనికి తీసుకునే ధరలు విషయంలో కొంత వ్యత్యాసం ఉండడంతో కొందరు



ల్యాండ్రోమార్ట్ పనులను ప్రారంభిస్తున్న కేటీఆర్, అధికారులు (ఫైల్)

వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో అధికారులు సైతం ముందుకు రావడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా పక్కన పెడితే తక్కువ సమయంలో ఎక్కువ బట్టలు ఉతకడం, ఇస్త్రీ చేయడం, డ్రైక్లీనింగ్‌తో రజకులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అట్టహాసంగా..

2021లో వరంగల్ నగరంలో మోడ్రన్ దోబీఘాట్‌నే ఏర్పాటు చేసేందుకు సంఘం ప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2022లో పనులు ప్రారంభమయ్యాయి. స్మార్ట్‌సిటీ ప్రత్యేక నిధులతో వరంగల్ పోతననగర్‌లో ల్యాండ్రో మార్ట్ (దోబీఘాట్) పనులు పూర్తి చేశారు. కాగా, పోతననగర్‌లోని దోబీఘాట్‌తో పాటు అలంకార్ జంక్షన్‌లో అభివృద్ధి పనులు, పాత సెంట్రల్ జైలు ముందు లైబ్రరీ, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను 2023 అక్టోబరు 6న అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. దోబీ కుల సంఘాల నాయకులు, కార్మికులను పిలిచి ఎక్స్‌పర్ట్స్ ట్రయల్ రన్ కూడా చేశారు. కానీ దోబీల ఆనందం ఎంతో సేపు ఉండలేకపోయింది. అదే రోజు వేసిన తాళం ఇప్పటికీ తెరుచుకోలేదు. బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కుల సంఘం నాయకులు నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో రజకులకు ప్రత్యేక రుణాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి దోబీఘాట్ పనులు అప్పగించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా ప్రభుత్వ వసతి గృహాలు, ఆస్పత్రులు, స్కూళ్లు, రెస్టారెంట్ల బట్టలు కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో ఇక్కడే ఉతికేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రజకుల్లో చాలామంది పెద్ద పెద్ద చదువులు చదివిన వారు నిరుద్యోగులుగా ఉన్నారని ఇక్కడ సుమారు 200 మందికి రెండు షిఫ్టులలో పనికల్పించి ఉపాధి అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే సులువుగా విలువైన బట్టలు ఉతికే దోబీ ఘాట్ సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటుందని రజక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు లక్షల రూపాయలు సంపాదించి పెట్టే పరికరాలు తుప్పుపట్టి పనికి రాకుండా పోయే పరిస్థితి ఉందని, బల్దియా అధికారులు బీసీ వెల్ఫేర్ అధికారులను పిలిచి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రజక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడి ఆత్మహత్య

తొర్రూరు, సెప్టెంబరు 5 : భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తొర్రూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... దంతాలపల్లి మండలం గున్నెపల్లికి చెందిన ఎస్.కె. షరీఫ్(28) తొర్రూరులో వెల్డింగ్ షాపులో కూలీ పనిచేస్తూ నివసిస్తున్నాడు. అతడికి ఇద్దరు కమార్తెలు. మద్యానికి బానిసై తిరుగుతుండడంతో పది రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోగా మనస్థాపానికి గురై ఉరివేసుకొని చనిపోయాడు. తండ్రి జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ట్రాక్టర్ డ్రైవర్..

డోర్నకల్, సెప్టెంబరు 5 : పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెంకు చెందిన దండుగుల వెంకన్న (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా వెంకన్న మద్యానికి బానిసయ్యాడు. దీంతో అయన భార్య ఎల్లమ్మ ఈనెల 4న అతన్ని మం దలించడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన వెంకన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానుకోట పట్టణంలో భారీ చోరీ

- 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2లక్షల నగదు అపహరించిన దుండగులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 5: జిల్లాకేంద్రంలో బుధవారం భారీ చోరీ జరిగి 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ పట్టణం శివారు కంకరమిల్లు సమీపంలో కాలనీకి చెందిన కాసోజు బ్రహ్మచారి పురోహితుడిగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు చెప్పారు. తన భార్య అశ్వినికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స నిమిత్తం గత శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లానని, వర్షాలు రావడంతో మహబూబాబాద్‌కు రాకపోకలు బంద్ కావడంతో హైదరాబాద్‌లోనే ఉన్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం తనభార్య అశ్విని తీసుకుని ఇంటికి వచ్చానని ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసినట్లు చెప్పారు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారం, 80 తులాల వెండి అభరణాలతో పాటు రూ.2. లక్షల నగదు కన్పించకపోవడంతో ఈ విషయాన్ని వెంటనే టౌన్ పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. ఘటన స్థలానికి క్లూజ్‌టీం సభ్యులు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఆపై వేలిముద్రలను సేకరించారు. ఈ విషయంపై బాధితుడు బ్రహ్మచారి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

జీవంజి దీప్తి తొలి గురువు కన్నుమూత

▸▸ ఆమెలోని క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లు (ఫైల్)

పర్వతగిరి, సెప్టెంబరు 5: పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తి తొలి గురువు అయిన బియ్యాని వెంకటేశ్వర్లు(55) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్వతగిరి మండలం కల్లెడలో నిర్వహిస్తున్న పాఠశాలలో 2000 సంవత్సరం నుంచి 2018 వరకు వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆ సమయంలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న దీప్తిలో దాగి ఉన్న క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు ప్రత్యేక శిక్షణనిచ్చారు. పాఠశాల, కళాశాలస్థాయిల్లో ఆయన ఇచ్చిన శిక్షణతోనే దీప్తి పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. అనంతరం సాయ్ అకాడమీలో శిక్షణ పొందింది. కాగా, పీఈటీ వెంకటేశ్వర్లు నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ తన స్వగ్రామమైన బయ్యారం మండలంలోని ఇర్సులాపురంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతిచెందారు.

కదిలిస్తున్న దీప్తి మాటలు


వెంకటేశ్వర్లుతో దీప్తి (ఫైల్)

ఇటీవల ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీప్తి తన మొదటి కోచ్ అయిన వెంకటేశ్వర్లు గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. 'వెంకటేశ్వర్లు సార్‌ది నిరుపేద కుటుంబం. నాలోని ప్రతిభను గుర్తించి ఆయన ఇచ్చిన ప్రత్యేక శిక్షణ నేను పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించగలిగా. ఒలింపిక్స్‌లో పాల్గొని మెడల్ సాధించిన తరువాత అది కళ్లారా చూసి చనిపోతానని సార్ అనేవారు' అంటూ దీప్తి ఆ ఇంటర్వ్యూలో తెలిపింది. కానీ యాధృచ్ఛికంగా నిజంగా ఆయన గతంలో దీప్తితో అన్నమాటలే నిజయమ్యాయి. దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న మరుసటి రోజునే ఆయన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో దీప్తి ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియో చూసి పలువురు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల స్వీకరణ




ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, కొంక అనురాధ, జి.వెంకటయ్య


డాక్టర్ ఎల్.కొమురారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయి పలువురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు స్వీకరించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కొంక అనురాధ, పి.సంపత్‌కుమార్, జి.వెంకటయ్య, డాక్టర్ ఎల్. కొమురారెడ్డి తదితరులు గురువారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను స్వీకరించారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వెంకట్రామిరెడ్డి, వాసం శ్రీనివాస్


పి.సంపత్‌కుమార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎంపీ కే. కేశవరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా ధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న డాక్టర్ వాసం శ్రీనివాస్

హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును గురువారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మాత్యు లు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు.


మట్కా నిర్వాహకుడిపై కేసు నమోదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతి నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న బండి రాజు నివాసంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నారు. చిరువ్యాపారులను మోసం చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న బండి రాజును విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. మిల్స్‌కాలనీ పోలీసులు రాజుపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధృవీకరించారు.

వైన్‌షాపులో చోరీ

ధర్మసాగర్, సెప్టెంబరు 5: ధర్మసాగర్ మండల కేంద్రంలోని వైన్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడ్డారు. సిబ్బంది కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని శివ బాలాజీ వైన్స్‌షాపులో గురువారం తెల్లవారుజామున షాపునకు సంబంధించిన కిటికీలకు అమర్చిన గ్రిల్స్‌ను గడ్డపారల సహాయంతో దొంగలు తొలగించారు. ఆ తర్వాత షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.85,500తో పాటు రూ.2వేల విలువైన మద్యాన్ని అపహరించారు. షాపు యాజమాని శ్యాంసుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషజ్వరంతో యువకుడి మృతి


విజయ్ (ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబరు 5: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు విషజ్వరంతో గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన మల్లెల విజయ్ (30) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం ఆయనకు జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ విజయ్ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య స్వర్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, విజయ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

వరహాల గుట్టకు మహర్దశ

- ▸▸ ములుగు జిల్లాలో మరో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- ▸▸ కాకతీయుల కాలం నాటి కట్టడాల గుర్తింపు
- ▸▸ త్వరలో గుట్టపై 40 గుడారాలు.. క్రాఫ్ట్ ఫైర్ ఏర్పాటు
- ▸▸ రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కొత్త శోభ


కాకతీయుల కాలంలో ఏర్పాటు చేసిన రాళ్లగోడ

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 5: కాకతీయుల కాలంనాటి రహస్య గుట్ట.. అక్కడ వజ్ర వైడూర్యాలు ఉన్నాయా? లేదంటే కాకతీయుల కాలంనాటి రహస్య స్థావరం ఉందా? రాజులుదాచిన ఖజానా ఏమైనా ఉందా? అనే ప్రశ్నలతో పాటు మేడారం సమ్మక్క-సారలమ్మలతో యుద్ధం జరిగిన సమయంలో కాకతీయ రాజులు ఇక్కడే సేద తీరినట్లు చెబుతుంటారు. ఇలా ఎన్నో అంతుచిక్కని ప్రశ్నలు దశాబ్దాలుగా ఆ గుట్టచుట్టు తిరుగుతూనే ఉన్నాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కనిపించే ఆ కొండపైకి ఎక్కడానికి ఈ తరం వారెవరూ అంతగా ఆసక్తి చూపరు. కానీ పైకి ఎక్కిచూస్తే చుట్టుపక్కల గ్రామాలన్నీ కనిపిస్తాయని చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయుల కాలంలో ఎడ్లబండ్లపై గుట్టపైకి వెళ్లినట్టు ఇటీవల గుర్తించిన పలు ఆనవాళ్ల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఆ గుట్టపైకి ఎక్కాలంటే నడవాల్సిందే. కాకతీయుల కాలంలో రామప్ప సరస్సు ఆయకట్టు కింద కాకతీయ రాజులు తాము పండించిన ధాన్యం బందిపోట్లు లాక్కెళుతున్నారని, ధాన్యం రక్షణ కోసం గుట్టపై రహస్య స్థావరం ఏర్పరిచినట్లు కథనం ప్రకచారంలో ఉంది. దీనికి తగ్గట్లే ధాన్యం ఆరబోసేందుకు ఓ కల్లం ఏర్పాటు చేసిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి.

గుట్టపై భారీ రాళ్ల గోడ

సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వరహాల గుట్ట పైభాగంలో రాళ్లతో భారీ ప్రహరీ నిర్మించారు. తాగునీటి బావి, పచ్చళ్లు నూరడానికి రోళ్లు, బండి చక్రాలు నడిచిన ఆనవాళ్లున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. శిథిలమైన ఓ వినాయకుడి విగ్రహం కూడా గుట్టపై లభ్యమైనట్టు తెలుస్తోంది. హిందూ సంప్రదాయం ప్రకారం మొదటి పూజ వినాయకుడికి చేస్తాం కాబట్టి కాకతీ యులు కూడా ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ గుట్ట ప్రారంభ దారిలోనే వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు భావిస్తున్నారు. అంతే కాకుండా అంత ఎత్తులో ఉన్న గుట్టపై బావి నిర్మించి నీటిని తోడుకున్నారంటే చాలా కాలం ఇక్కడ నివసించి ఉన్నారని అర్థం చేసుకోవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇది నిర్మించింది కూడా రేచర్లే!

కాకతీయ సేనాని రేచర్ల రుద్రయ్య రామప్ప దేవాయాన్ని నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తుండగా అదేవిధంగా వరహాల గుట్టపై కాకతీయుల ఉన్నట్లు వారి అవసరాల కోసం అక్కడ అన్నీ నిర్మాణాలు చేసినట్టు భావిస్తున్నారు. కొందరు సైనిక స్థావరం కోసమని, మరికొందరు విలువైన సంపద, ఖజానా దాచుకోవడం కోసమని, ఇంకొందరు సమ్మక్క-సారక్కలతో యుద్ధం జరిగిన సమయంలో రాజులు సేద తీరడాకని, విలువైన ఆభరణాలు, ధాన్యం దాచుకోవడానికని గుట్టపై ఏర్పాట్లు చేసుకున్నారని చెబుతున్నారు. అందువల్లే ఈగుట్టకు వరహాలగుట్ట అనే పేరు వచ్చిందని భావిస్తున్నారు. కాకతీయులు నిర్మించిన ఈగుట్ట పైభాగంలో ఉన్న పురాతన సంపదనను కాపాడటంతో పాటు పర్యాటకులకు ఈ అందాలు, కాకతీయుల కాలం నాటి గుర్తులను చేరువ చేసేలా అభివృద్ధి చేయనున్నట్టు సమాచారం. మరో నెలరోజుల్లో ఈ గట్టుకు మహర్దశ వచ్చేలా చర్యలు తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది.

గుట్టపై ప్రదేశంలో పర్యాటకుల కోసం గుడారాలు

ఆటవీశాఖ ఆధ్వర్యంలో రామప్ప సరస్సు సమీపంలో ఉన్న వరహాలగుట్టపై ఉన్న ఐదెకరాల ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు ములుగు అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) ఆదేశాలతో ములుగు ఫారెస్ట్ రెంజర్ డోలి శంకర్ ఆధ్వర్యంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా పనులు మొదలయ్యాయి. ఈ నెలాఖరు కల్లా గుట్టపైకి పర్యాటకులను అనుమతించే అవకాశం కనిపిస్తోంది. అయితే కాలినడకన వెళ్లేందుకు మూడు మీటర్ల వెడల్పుతో గుట్టకు ఉన్న బండరాళ్ల తోనే దారి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రహదారి పనులు పూర్తి కావస్తుం డగా.. పనులు వేగంగా జరుగుతున్నాయి. గుట్టపై 50 గుడారాలు ఏర్పాటు చేసి వాటి ముందు భాగంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా క్రాఫ్ట్ ఫైర్ (కట్టెలతో మంటలు) ఏర్పాటు చేయనున్నారు. రామప్ప సరస్సు సమీపంలోని వరహాల గుట్ట పర్యాటకంగా విరాజిల్లానుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


వరహాల గుట్టపైకి వేస్తున్న కాలిబాట

సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేయాలి

పూల్యాల రామన్న, టూరిజం మార్కెటింగ్ ప్రచారకర్త



కాకతీయుల చరిత్రతో పాటు మనకు అంతు చిక్కని బోలెడు విషయాలు వరహాల గుట్ట పైభాగంలోనే కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలోనూ ఈ వరహాల గుట్ట గురించి కొందరికి మాత్రమే తెలుసు. ప్రభుత్వం, పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటే అంతరించిపోతున్న కాకతీయుల చరిత్రను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు అందించే అవకాశం ఉంది. దీంతో పాటు గుట్టపైకి పర్యాటకులు వెళ్లేందుకు రామప్ప సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటక శాఖకు, ప్రభుత్వానికి నిజంగానే 'వరాలు' కురుస్తాయి.

ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం



తాళ్లపూసపల్లిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, వ్యవసాయ డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ పరిశీలిస్తున్న గవర్నర్

- ▸▸ ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయింపు
- ▸▸ త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- ▸▸ కేసముద్రంలో సదస్సుకు హాజరు

కేసముద్రం, సెప్టెంబరు 5 : పర్యావరణాన్ని కాపాడుకుంటూ చేసే ప్రకృతి వ్యవసాయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయించిందని, సహజసిద్ధ విధానంలో పండిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్న వారు ఆరోగ్యంగా ఉంటారని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో గురువారం 'ప్రకృతి వ్యవసాయం'పై నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. తొలుత గవర్నర్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఇంద్రసేనారెడ్డి తాళ్లపూసపల్లి, కల్వల గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు 'నమోడ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మంజూరైన వ్యవసాయ డ్రోన్‌ల పనితీరును పరిశీలించారు. ఆ తర్వాత అభినవ్‌రెడ్డి ఫౌండేషన్ బాధ్యుడు సొల్లేటి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గత వారంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రైతు సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారని, భూసారం వివరాలతో కూడిన 'భూమి ఆరోగ్య కార్డు'ను రూపొందించేందుకు నిర్ణయించిందని వివరించారు. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన గవర్నర్ల సమావేశంలో ప్రధాని మోదీ చొరవతో ప్రకృతి సాగు విధానంలోని పంట ఉత్పత్తులతో వండిన భోజనాన్ని వడ్డించారని చెప్పారు. తాను పని చేస్తున్న త్రిపుర రాష్ట్రంలో కూరగాయల మొక్కల ఆకులను సైతం వంటల్లో వినియోగిస్తూ విక్రయిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో పశువులను వినియోగించే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు.

భూ తాపంతోనే వరదలు

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్

పెరిగిన రసాయన మందుల వినియోగం, వాతావరణ కాలుష్యం, భూ తాపంతోనే వరదలు, ప్రకృతి విపత్తులు వస్తున్నాయని, ఇది ఆరంభమేనని.. భవిష్యత్తులో ఇంకా ఇలాంటివి వస్తాయని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్ హెచ్చరించారు. ఈ సదస్సుకు శిక్షకుడిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సూక్ష్మపోషకాలు లేని ఆహారాన్ని తీసుకుంటున్నారని తద్వారా కాన్సర్, తదితర వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఏ జీవిని చంపకుండా అహింసా మార్గంలోనే ప్రకృతి వ్యవసాయ విధానం ఉంటుందని తెలిపారు. ప్రకృతి సాగు విధానంలో ఒక ఎకరంలో రూ.3 లక్షల ఆదాయాన్ని చూపుతానని వివరించారు. తాను పండించిన ఆహార ఉత్పత్తులతోనే తిరుపతిలో ప్రసాదం తయారు చేస్తున్నారని తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ప్రకృతి విధానంలో పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని సదస్సుకు హాజరైన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కోరారు. 'నమో డ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాకు మూడు వ్యవసాయ డ్రోన్‌లు ఇచ్చారని, తమ నర్సంపేట నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు కూడా డ్రోన్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్‌డీవో అలివేలు, రాంమోహన్‌రెడ్డి, డీఏవో విజయనిర్మల, ట్రాన్స్‌కో డీఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ టి.దామోదర్, ఏవో బి.వెంకన్న పాల్గొన్నారు.

వాయిదా పడిన ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్షలు 9న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ ఐదేళ్ల ఇండిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ పరీక్షలను సెప్టెంబరు 9న నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పీఎస్ఎల్ సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 2న జరగాల్సిన పరీక్షలు భారీవర్షాల కారణంగా వాయిదా పడిన విషయం విదితమే. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల సమయంలో, పరీక్షల కేంద్రాల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమ టిపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసారు. గురువారం పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు రూ.31వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్స్ స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకుని నలుగురిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధృవీకరించారు.

జూడో క్రీడాకారులకు చేయూత


క్రీడాకారులకు రవాణా చార్జీల టికెట్లను అందజేస్తున్న శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 5: జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబరు 9నుంచి 12 వరకు చెన్నైలో నిర్వహించనున్న 4వ ఖేలో ఇండియా ఉమెన్స్ సబ్ జూనియర్స్, సీనియర్స్ సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న జిల్లా జూడో క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారుడు ఎల్.శ్రీనివాస్ రవాణాఖర్చులను అందించారు. వరంగల్ ఓ సిటీ క్రీడా మైదానంలో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూడో శిక్షణ కేంద్రాన్ని గురువారం శ్రీనివాస్ సందర్శించి క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలపై ఉన్న ఆసక్తితో ఒక సీనియర్ క్రీడాకారుడిగా ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులకు చేయూతనందించేందుకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఓసిటీ క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న 10మంది క్రీడాకారిణులకు చెన్నైలో నిర్వహించనున్న సౌత్‌జోన్ పోటీలకు హాజరుకానున్న నేపథ్యంలో వారు క్రీడా పోటీలకు వెళ్లి రావడానికి రైల్వే రవాణా ఖర్చులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీవైఎస్‌వో సత్యవాణి, ఖేలో ఇండియా జూడో కోచ్ జె.లింగమూర్తి డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన టేకులగూడెం

- ▸▸ ముగిసిన మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అంత్యక్రియలు
- ▸▸ అంతిమయాత్రకు హాజరైన ప్రముఖులు
- ▸▸ ఇది బూటకపు ఎన్‌కౌంటర్ : భారతక్క

కాజీపేట, సెప్టెంబరు 5: ఎర్ర జెండాలతో టేకులగూడెం ఎరుపెక్కింది. ఎర్రజెండాల సాక్షిగా ఎన్‌కౌంటర్‌లన్నీ బూటకమే అంటూ ఫ్లెక్సీల ద్వారా ప్రజాసంఘాల నేతలు ఎండగట్టారు. ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనంటూ మానవహక్కుల సంఘాల నిలదీత పోస్టర్‌లు టేకులగూడెంలో దర్శనమిచ్చాయి. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా అంతిమ సంస్కారాలు గురువారం రాత్రి ముగిశాయి. ఉదయం ఏసోబు పార్థీవదేహాన్ని స్వగ్రామమైన టేకులగూడెంకు కుమారుడు మాచర్ల మహేశ్ తీసుకువచ్చారు. గ్రామస్తులు,బంధువులు, మావోయిస్టు అభిమానులు, సానుభూతిపరులు తండోపతండాలుగా టేకులగూడెం వచ్చి ఏసోబు పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య చేరుకుని ఏసోబు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళాబృందాలతో అంతిమయాత్ర

జోహార్ ఏసోబన్న.. ఏసోబన్న ఆశయాలను కొనసాగిద్దాం.. నీ త్యాగం మరువం.. అంటూ కళాబృందాలు, ప్రజాసంఘాల నేతల నినాదాలతో టేకులగూడెం హోరెత్తింది. ఏసోబు అంతిమయాత్ర గురువారం ఉదయం 11:30 నిమిషాలకు ప్రారంభమైంది. కళాకారులు ఆటలాడుతూ, పాటలు పాడుతూ భారీ ర్యాలీతో అంతిమయాత్ర సాగింది. ఎస్సీ కాలనీ నుంచి ప్రారంభమైన ఈ అంతిమయాత్ర.. గ్రామంలోని అన్ని కాలనీల మీదుగా సాగింది. సాయంత్రం 5:30 నిమిషాలకు విప్లవ సంప్రదాయం ప్రకారం నివాళులర్పించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఏసోబు కుమారుడు మాచర్ల మహేశ్ దహన సంస్కారాలు పూర్తిచేశారు. కాగా, ఈ అంతిమ యాత్రలో ఇంటెలిజెన్స్ పోలీసులు పాల్గొని అంతిమ యాత్ర జరిగిన తీరు, హాజరైన వారి వివరాలు సేకరించినట్లు సమాచారం.


అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబీకులు

బూటకపు ఎన్‌కౌంటరే..

ఏసోబుది కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటరేనని మాజీ మావోయిస్టు భారతక్క ఆరోపించారు. అంతిమయాత్రకు హాజరైన ఆమె మాట్లాడుతూ.. మావోయిస్టులను పట్టుకుంటే పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించాలని, కానీ హత్య చేయడం దారుణమన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బంధుమిత్రుల కమిటీ జాయింట్ సెక్రటరీ శాంతక్క, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జనగామ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్నలు మాట్లాడుతూ.. ఆదివాసీలను, గర్భిణులను బట్టలూడదీసి కాల్చడం పోలీసుల పాశవిక చర్యలు అన్నారు. బొగ్గు, ఇనుము బహుళ జాతీయులకు అంటగట్టడానికి ఖగార్ ఆపరేషన్ పేరుతో ఏసోబును బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నారు. ఎన్‌కౌంటర్‌లన్నీ కేంద్ర ప్రభుత్వం చేసే హత్యలేనన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన మోదీ, నితీష్, చంద్రబాబు నాయుడు అండతోనే ఈ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. ఇలాంటివి జరగకుండా ఇండియా కూటమి నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఏసోబు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.


ఏసోబు అంతిమయాత్రలో బూటకపు ఎన్‌కౌంటర్ల ఫ్లెక్సీతో పౌరహక్కుల నేతలు

తుది దశకు ట్రాక్ మరమ్మతులు

- ▸▸ ఇంటికన్నె వద్ద రెండు పట్టాలు సిద్ధం
- ▸▸ తెల్లవారుజామున డౌన్‌లైనుపై ట్రయల్‌రన్
- ▸▸ పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ.. కాషన్ ఆర్డర్‌తో రాకపోకలు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 5: సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య 418 కిలోమీటరు వద్ద వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. చెన్నై-న్యూ ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ లైనుగా పేరున్న ఈ ట్రాక్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. బుధవారమే అప్‌లైన్ సిద్ధమవగా గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయానికి డౌన్‌లైను మరమ్మతులు పూర్తిచేసి ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతంలో అప్ అండ్ డౌన్ లైన్లు రాకపోకలకు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నుంచి గోల్కొండ, కృష్ణా, ఈస్ట్‌కోస్ట్, అండమాన్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లను అప్‌అండ్‌డౌన్ వైపుల నడిపించారు. అయితే మరమ్మతులు జరిగిన ప్రాంతంలో కాషన్ ఆర్డర్‌తో ఈ రైళ్లను నడపగా బుధవారం అప్‌లైనులో 5కిలోమీటర్ల వేగంతో వెళ్లగా, గురువారం 30 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నాయి. ఇక తాజాగా అందుబాటులోకి వచ్చిన డౌన్‌లైనులో 5 కిలోమీటర్ల వేగంతోనే వెళుతున్నాయి. అయితే ఇక్కడ ట్రాక్ సిద్ధమైనప్పటికీ విజయవాడ రాయనపాడు ప్రాంతంలో రైల్వేట్రాక్ ముంపునకు గురికావడంతో ఈ మార్గంలో పలు రైళ్లను నడపడంలేదని తెలుస్తోంది. శుక్రవారం నుంచి డోర్నకల్, భద్రాచలం రోడ్, మణుగూరు ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, బల్లార్ష ప్రాంతాలకు నడిచే రైళ్లను పునరుద్ధరించనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇంకా పూర్తిస్థాయిలో మరమ్మతుల కోసం రైల్వే సిబ్బంది ఈ ప్రాంతంలో పని చేస్తూనే ఉన్నారు. ఏదేమైనా వరద తాకిడికి పూర్తిగా తెగిపోయిన రైలుకట్టను నాలుగు రోజుల పాటు తీవ్రంగా శ్రమించి రెండు ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకురావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఇంటికన్నె వద్ద తెల్లవారుజామున డౌన్‌లైనులో ట్రయల్ రన్‌లో వెళుతున్న గూడ్స్


కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద మరమ్మతులు పూర్తి చేసుకొని సిద్ధమైన డౌన్ లైను

వరంగల్ మీదుగా పాక్షికంగా నడిచిన రైళ్లు

▸▸ నేటి నుంచి గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటీ

గిర్మాజీపేట, సెప్టెంబరు 5: భారీ వర్షాలు, వరదల కారణంగా ఇంటికన్నె-కేసముంద్రం, మహబూబాబాద్-తాళ్లపూసలపల్లి మధ్య ధ్వంసమైన రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణ పనులు గురువారం ఉదయానికి పూర్తయి రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ గురువారం విజయవాడ-సికింద్రాబాద్ మార్గంలో వరంగల్ మీదుగా రైళ్లు మాత్రం పాక్షికంగా నడిచాయి. సికింద్రాబాద్ - గుంటూరు, సికింద్రాబాద్-విజయవాడ మధ్య నడిచే గోల్కొండ, ఇంటర్‌సిటీ, శాతవాహన రైళ్లు రద్దవగా.. ఈ రైళ్లు శుక్రవారం నుంచి యథాతథంగా నడవనున్నాయి. ఇక విశాఖపట్టణం-మహబూబ్‌నగర్, విశాఖపట్టణం - నాందేడ్, తిరుపతి - సికింద్రాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, గూడూరు - సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, తాంబరం-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి, అలాగే వరంగల్ మీదుగా వెళ్లాల్సిన కేరళ ఎక్స్‌ప్రెస్‌ను గురువారం కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించారు. అలాగే న్యూఢిల్లీ- చైన్నై, న్యూఢిల్లీ-విశాఖపట్టణం మధ్య నడిచే జీటీ, తమిళనాడు, ఏపీ ఏసీ రైళ్లను గురువారం రద్దు చేశారు. దూరప్రాంతాల నుంచి బుధవారం బయలుదేరిన కొన్ని రైళ్లు మాత్రమే గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి. శుక్రవారం నుంచి అన్ని రైళ్లు యథావిధిగా నడుస్తాయని గురువారం రాత్రి రైల్వే వర్గాలు వెల్లడించాయి.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2945	2700
పల్లికాయ (సూక)	5100	4500
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6833	4552
పత్తి	7665	5000
పసుపు (కాడి)	12759	10000
పసుపు (గోల)	12009	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	15200	13000
యూఎస్341 ఏసీ	14500	11000
దేశీ ఏసీ	22000	20000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

చికిత్స పొందుతూ

డిగ్రీ విద్యార్థిని మృతి



ప్రవళిక (ఫైల్)

కాటారం, సెప్టెంబరు5: కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై అభినవ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధి లోని దుబ్బులపల్లి గ్రామానికి చెందిన బోగిరి రాజమొగిలికి కూతురు ప్రవ ళిక (18), కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. ప్రవళిక భూపా లపల్లిలోని ఓ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతోంది. గత ఏడాది నుంచి కూతురు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండగా రాజమొగిలి స్థానికంగా వైద్యం చేయిం చాడు. తాత్కాలికంగా నొప్పి తగ్గినా తిరగబెట్టడంతో ఆర్ఎం పీలు మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు తీసుకెళ్లాలని సూచించారు. సరైన ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రులకు తీసుకెళ్లకుండా టాబ్లెట్లు తెప్పించి వేయడంతో కడుపునొప్పి తగ్గినట్టే తగ్గి మళ్లీ ఎక్కువ అయ్యేది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ప్రవళిక గత నెల 29న తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగానే పురుగుల మందు తాగింది. దగ్గరి బంధు వులు చూసి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు 108 అంబులెన్స్‌లో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ప్రవళిక మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజమొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'అదనపు బకెట్ దందా'పై ఆరా!

వెలుగులోకి విస్తుపోయే నిజాలు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 5 : పలిమెల మండల పరిధి పంకెన ఇసుక క్వారీలో ఇసుక అదనపు బకెట్ దందాపై నిఘావర్గాలు ఆరా తీసినట్లు తెలిసింది. 'ఇసుక క్వారీలో అదనపు బకెట్ దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై స్పందించినట్లు తెలుస్తోంది. ఒక్కో రోజులో క్వారీకి వచ్చే లారీలు ఎన్ని.. ఒక్కో లారీ నుంచి ఎంత మేర వసూళ్లకు పాల్పడుతున్నారు? అనే కోణంలో విచారణ చేసినట్లు తెలిసింది. ఈ వసూళ్లలో ఎవరెవరి భాగస్వామ్యం ఉందనే కోణంలోనూ ఆరాతీసినట్లు తెలిసింది. ఇసుక క్వారీలో అదనపు బకెట్ దందా వ్యవహారంపై పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు సమాచారం. అయితే.. నిఘావర్గాలు అదనపు బకెట్ దందాపై చేసిన విచారణలో విస్తుపోయే నిజాలు వెల్లడైనట్లు తెలిసింది. లోడింగ్ నిమిత్తం వచ్చే ఒక్కో లారీ నుంచి అదనపు బకెట్‌తో పాటు పాసింగ్ కోసం రూ.5వేల నుంచి రూ.8 వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నట్లు గుర్తించినట్లు తెలిసింది. వసూలు చేసిన డబ్బుల నుంచి సంబంధిత శాఖకు చెందిన కొందరు వ్యక్తులకు రూ.వెయ్యి, ఆపై స్థాయికి చెందిన మరొకరికి రూ.3 వేలు, మిగిలిన మొత్తం క్వారీ నిర్వాహకులు తీసుకుంటున్నట్లు గుర్తించినట్లు సమాచారం. దీనిపై మరోమారు టీఎస్ఎండీసీ పీవో తారక్‌నాథ్‌ను వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. క్వారీలో లోడింగ్ ప్రక్రియతో పాటు ఇతర సమస్యలు ఎదురైనప్పుడు డ్రైవర్లు ఫిర్యాదు చేసేందుకు పీవోను సంప్రదించిన స్పందించడం లేదనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. క్వారీల నిర్వహణ, అక్కడ ఎదురయ్యే సమస్యలను తెలియజేసేందుకు వచ్చే ఫోన్లపై సైతం స్పందించకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కోటగుళ్లను సందర్శించిన నార్కోటిక్ ఎస్పీ

గణపురం, సెప్టెంబరు 5: మండల కేంద్రంలోని గణపేశ్వరా లయం(కోటగుళ్ల)ను నార్కోటిక్ బ్యూరో ఎస్పీ పోతరాజు సాయి చైతన్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబానికి కోటగు ళ్లతో అనుబంధం ఉందన్నారు. అనంతరం గోశాల వద్ద గోవు లకు పండ్లు అందించారు. ఆయన వెంట హైకోర్టు అడ్వకేట్ కశ్యప్ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు సర్కారు అండ

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 5: నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు అన్నారు. భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల అభ్యు న్నతికి రేవంత్ సర్కారు అహర్నిశలు పాటుపడుతోందన్నారు. ఆడబిడ్డల కోసం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజర్ల అశోక్, మధు, రాంచందర్, దేవన్, సాంబమూర్తి, శ్రీను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నేరుగా పథకాలు

రేగొండ: ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువే దికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. 81 మంది లబ్ధిదారులకు చెక్కులను పం పిణీ చేసినట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబార్ పథ కాలతో ఎంతో మంది నిరుపేద ఆడబిడడలకు ఆసరాగా

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నిలిచాయన్నారు. ఈకార్యక్రమంలో తాహల్దార్ శ్వేతరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సన్న, నాయకులు మల్లారెడ్డి, రవి, బిక్షపతి, వీరబ్రహ్మం, రాంబాబు, రవీందర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

చిట్యాల: రాష్ట్రంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని 20మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక రైతువేదికలో ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెం టీల హామీని అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. పలు కారణాలతో రుణమాఫీ కాని రైతులకు త్వర లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. ఈకా ర్యక్రమంలో చిట్యాల ఏఎంసీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవీ సత్య నారాయణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ, అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, మండల అధ్యక్ష, కార్య దర్శులు గూట్ల తిరుపతి, గడ్డం కొమురయ్య, మాజీ జడ్పీటీసీ ఓరం సమ్మయ్య, ఏఎంసీ డైరెక్టర్ చెన్న చందర్, ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యల యంలో 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడి

మహిళకు గాయాలు



గాయపడ్డ స్వరూప

ములుగు, సెప్టెంబరు 5: ఆర్టీసీ బస్సు దిగుతూ జారి పడిన ఘటనలో ఓ మహిళ గాయప డింది. గోవిందరావు పేటకు చెందిన జన్ను స్వరూప ములు గులో ఓ హోటల్‌లో పనిచేస్తు న్నారు. గురువారం సాయంత్రం పని ముగించుకొని ఇంటికి వెళ్లేం దుకు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లారు. ఏటూ రునాగారం వైపుకు వెళ్లే బస్కె క్కాల్సిన ఆమె పొరపాటును పరకాల బస్సెక్కారు. బస్సు ముందుకు కదిలిన క్రమంలో విష యం తెలుసుకున్న స్వరూప బస్సును ఆపమని డ్రైవర్‌ను కోరుతూనే దిగే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో కిందపడ్డ ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. గమ నించిన బస్టాండు కంట్రోలర్ బైకాని మోహన్‌యాదవ్ స్వరూపను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.

ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి నిరసనగా బీజేపీ రాస్తారోకో



ములుగులో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 5: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన లైంగిక దాడికి నిరసనగా గురువారం ములుగులో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. నిందితుడికి ఉరిశిక్ష వేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట రహదారిపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీజేపీ నాయకులు బైఠాయించారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసి నిందితునికి కఠిన శిక్ష విధించాలన్నారు. బాధిత మహిళ కుటుం బానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన ఫొటో ముద్రించిన ఫ్లెక్సీని దగ్ధం చేసేందుకు యత్నించగా అప్పటికే అక్కడ మోహరించిన సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీ సులు, బీజేపీ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవీంద్రాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, ములుగు, వెంకటాపూర్ మండలాల అధ్యక్షులు గాదం కుమార్, ఫైడాకుల మల్లేష్, నాయకులు నగరపు రమేష్, శ్రవణ్, ప్రవీణ్, మహేష్, రాకేష్, రాజ్‌కుమార్, సురేష్, పవన్, సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

వెంకటాపురం(నూగూరు): జైనూరులో ఆదివాసీ మహిళపై అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ మహిళపై రెండురోజుల క్రితం అత్యాచారం చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణబాబు, సతీష్, శంకర్, నాగరాజు, శిరీష, మంజుల, అశోక్ పాల్గొన్నారు.

చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తి చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 5: చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికా రులను ఆదేశించారు. గురువారం కలెక్టరే ట్‌లో చిన్న కాళేశ్వరానికి భూసేకరణపై అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ చిన్న కాళేశ్వరం భూసేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల భూముల సమస్య పరిష్కారానికి సంయుక్తంగా సర్వే నిర్వహించి నివేదిక అందించాలన్నారు. ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి బీర సాగర్ నుంచి అవస రమైన ఇసుక కేటాయించాలని ఆదేశించారు. రెండోదశ ప్రాజెక్టు నిర్మాణా నికి అవసరమైన అటవీ భూముల కోసం పీసీసీఎఫ్‌కు ఇరిగేషన్ ఎస్ ద్వారా ప్రతి పాదనలు పంపించాలన్నారు. ప్రాజెక్టు ద్వారా 4 మండలాల్లోని 45,280 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిచడంతో పాటు 14 చెరువుల ద్వారా 63 గ్రామాలకు తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. డీఎఫ్‌వో వసంత, ఆర్డీవో మంగీలాల్, విద్యుత్‌శాఖ ఎస్ఈ మల్హార్ నాయక్, ఇరిగేషన్ ఈఈ యాదగిరి, మెగా ప్రాజెక్టు పీవో పాషా, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇంటింటి జ్వర సర్వే చేయాలి

చిట్యాల, సెప్టెంబరు 5 : జ్వరాలు ఎక్కువగా ప్రబలే గ్రామాల్లో ఇంటింటి జ్వర సర్వేను చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిని ఆయన గురువారం తనిఖీ చేశారు. వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని, ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయానికి

15 మంది ఉద్యోగులు

కాటారం, సెప్టెంబరు 5: కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వర్తించడానికి రెవెన్యూ శాఖ నుంచి 15 మంది అధికారులు, సిబ్బందిని కేటాయిస్తూ కలెక్టర్ రాహుల్ శర్మ ఉత్తర్వులు జారీ చేయగా అందరూ గురువారం జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. జిల్లాలోని ఆర్డీవో కార్యాలయంతో పాటు వివిధ మండలాలకు చెందిన అధికారులు, సిబ్బందిని డిప్యూటేషన్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏవోగా పూర్తి అదనపు బాధ్యతలతో భూపా లపల్లి ఆర్డీవో కార్యాలయం భూసేకరణ విభాగం నాయబ్ తహసీల్దార్ బ్రహ్మేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెం ట్లుగా ఉదయ్‌కిరణ్, మహదేవపూర్ అంకూస్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎస్‌వోగా మల్హర్ ఎంపీఎస్‌వో శివకృష్ణ, పలు మం డలాలకు చెందిన జూనియర్ అసిస్టెంట్లు రాజయ్య, పూర్ణ చందర్, ఇం దారపు మహేష్, టైపిస్ట్‌గా గణపురం మం డలానికి చెందిన సందీప్, రికార్డ్ అసిస్టెంట్లు షబానాబేగం, నాగరాజు, ఆఫీస్ సబార్డినేట్లుగా సయ్యద్ అషూ, గడ్డం శ్రీనివాస్, బోడ నరేష్, వెంకటి, డ్రైవర్‌గా శంకర్‌రావును నియమించగా వారంతా విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన అధికారులు



సబ్ కలెక్టర్‌కు బొకే ఇస్తున్న తహసీల్దార్

కాటారం సబ్ కలెక్టర్‌గా నియమితులై గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఐఏఎస్ అధికారి మయాంక్‌సింగ్‌ను కాటారం తహసీల్దార్ అంటె నాగరాజు, కాటారం డిప్యూటీ తహసీల్దార్, ట్రెసా జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, కార్యదర్శి ఎం.ఎ.రజాక్, మహదేవపూర్ డీటీ కృష్ణ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. బొకేలు అందించి స్వాగతం పలికారు. మయాంక్‌సింగ్ సబ్ కలెక్టర్‌గా త్వరలోనే విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

'ఉపాధిహామీ' సామాజిక తనిఖీ

చిట్యాల, సెప్టెంబరు 5: మండల క్రేందంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 15వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో జరి గిన పనుల్లో అవకతవకలను డీఆర్పీ, ఎస్ఆర్పీలు చదివి వినిపించారు. పలు గ్రామాల్లో మస్టర్లు సరిగా రాయకపోవడం మూలంగా కూలీలు నష్టపో యారని, పని ప్రదేశాల్లో కొలతలు తక్కువగా ఉన్నాయని, ఉపాధి పనికి రాని వారికి మస్టర్లు వేసినట్లు గుర్తించామన్నారు. గిద్దెముత్తారం, జూకల్లు, ఓడితల, నైన్‌పాక, లక్ష్మీపూర్, నవాబుపేట, దూత్‌పల్లి, కొత్తపేట, తిర్మల పురం, చల్లగరిగ, కైలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన సామాజిక గ్రామ సభల్లో వెల్లువెత్తిన అంశాలపై విచారించారు. అవకతవలకు పాల్పడిన సిబ్బంది, అధికారులకు అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, అడిషనల్ డీఆర్డీవో, ప్రెసిడింగ్ ఆఫీసర్ వసుమతి జరిమానా విధించారు. మొత్తం 25 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై చర్చించాల్సి ఉండగా, సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం కొనసాగనుంది. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో అలీం, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పుట్ట మధు పరామర్శ

కాటారం, సెప్టెంబరు 5: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. వీరాపూర్, విలాసాగర్, గంగపురి గ్రామాలకు చెందిన గుంటి చిన్నమల్లయ్య, వెంకటేశ్వర్‌రావు, గోనె పద్మలు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మధు పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త పప్పుల డేవిడ్ ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న రజితను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు జక్కు రాకేష్, జోడు శ్రీనివాస్, రామిళ్ల కిరణ్, బాసాని రవి, తైనేని సతీష్, నరివెద్ది శ్రీనివాస్, రాజు, మధూకర్, శంకర్, మహేష్, నరేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీచర్స్‌డే

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 5: మండలకేంద్రంలో ఆదివాసీ నవ నిర్మాణసేన ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతి సందర్భంగా గురువార ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా వెంకటాపురం, వాజేడు మండలాల్లోని ఉపాధ్యాయులను సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహమూర్తి సన్మానించారు. ఉపాధ్యాయులు పీర్ల కృష్ణబాబు, కోరం సంతోష్, సూర్యనా రాయణ, పరమే శ్వర్‌రావు, లక్ష్మయ్య, చిరంజీవి, పూనెం రమేష్, ఇందిర, జీవన జ్యోతి, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

- కన్నాయిగూడెం: మండలంలో టీచర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. చింత గూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్న పర్వతాల సతీష్ మండల ఉత్తమ ఉపాధ్యాయుడి ఎం పిక కావవడంతో ఆయన్ను సన్మానించారు.
- మహదేవపూర్ : స్థానిక డిగ్రీ కళాశా లలో గురుపూజోత్సవం జరిగింది. ప్రిన్సి పాల్ జన్ను విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వంగపల్లి పరుశరాములు, అధ్యాపకులు శ్రీనివాస్, వి.రమేష్, పి.రాజు, మాధవి, జి.రమేష్, రజిత, మున్నయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.
- భూపాలపల్లిటౌన్ : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాలలో గురుపూజోత్సవాన్ని నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ హరికృష్ణ, కళాశాల కరస్పాండెంట్ గుర్రపు రవీందర్, లెక్చరర్లు మొగిళి, నరేందర్, రాజేష్, ఆనంద్, నరేష్, రవీందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.
- మంగపేట: మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్లు, సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కాటారం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్స వాన్ని నిర్వహించారు. ఉపాధ్యా యులను యాజ మాన్య ప్రతినిధులు, విద్యార్థులు సన్మానిం చారు. దేవరాంపల్లి, చింతకాని, కాటారం, ధన్వాడ జడ్పీహెచ్ఎస్ హెచ్ ఎంలు శ్రీదేవి, ఉమారాణి, శైలజ, శ్రీదేవి పాల్గొన్నారు.
- మల్హర్: మండలంలోని చిన్న తూం డ్లలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపా ధ్యా యుడు బెజ్జం సతీష్‌ను ఉపా.ధ్యాయ దినో త్సవం సందర్భంగా గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ఐడీ కార్డులు, టై బెల్ట్, వాటర్ బాటిల్లను బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బెజ్జం సతీష్, పినుమల్ల నరసింగం బహూకరించారు. కాంప్లెక్స్ హెచ్ఎం బాస్కర్‌రావు, సాంబయ్య, రమాదేవి, గ్రామస్థులు శ్రీనివాస్, నర్సయ్య, మల్లయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.
- వాజేడు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీహై స్కూల్‌తో పాటు మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గురుపూ జోత్సవం జరిగింది. జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి చంద్రకళ హాజరయ్యారు. .

భారీ వర్షానికి ఇల్లు నేలమట్టం

మంగపేట, సెప్టెంబరు 5: మండల కేంద్రంలోని పొద్మూరు కాలనీకి చెందిన నిరుపేద నాయీ బ్రాహ్మణుడు దాగం సత్యం పెంకుటిల్లు గురువారం నేలమట్టమైంది. ఆ కుటుంబం రోడ్డున పడడంతో సహచర నాయీ బ్రాహ్మణులు తమవంతుగా విరాళాలు సేకరించి రూ. 10 వేలు అందజేశారు. ఏటూరునాగారం మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం సైతం ఆర్థికసాయం అందించింది. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మల్యాల రాంచందర్, జిల్లా గౌరవ సలహాదారు దడిగల సమ్మయ్య, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు దడిగల సత్యం పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో బెడ్ల కొరత లేదు

సూపరింటెండెంట్ జగదీశ్వర్

ములుగు, సెప్టెంబరు 5: ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బెడ్ల కొరత లేదని, ఆస్పత్రికి వచ్చే రోగులందరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో సరిపడా బెడ్లు లేవంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర సూచనల మేరకు అదనపు బెడ్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, వైద్య నిపుణులతో స్థానికంగా మెరుగైన సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మధుకర్ (ఫైల్)

మంగపేట, సెప్టెంబరు 5: మూడు రోజుల క్రితం యువకుడు గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అదేరోజు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యం అం దిస్తుం డగా గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెరుపల్లికి చెందిన లగ్గ పద్మ- సమ్మయ్య దంపతుల రెండో కుమారుడు లగ్గ మధుకర్(27) మంగపేటలోని జాన్‌డీర్ ట్రాక్టర్ షోరూమ్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. మధూకర్ అన్నయ్య ఫిర్యాదుతో ఎస్సై టీవీఆర్ సూరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలం సర్వే

కాటారం, సెప్టెంబరు 5 : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలాన్ని గురువారం జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సర్వే చేశారు. ఏఎంసీ స్థలం 12ఎకరాల 9గుంటలకు కొంత కబ్జాకు గురైందని, సర్వే చేసి హద్దులు చూపాలని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాల మేరకు సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ దేవరాజ్, డీఐ గణేష్‌జాదవ్ నేతృత్వంలో సర్వేయర్లు వినయ్, సురేష్, సుదర్శన్‌లు సర్వే చేపట్టారు. హద్దుల పాయింట్లు గుర్తించడంతో మూడు వైపులా కొంత భూమి అన్యాక్రాంతం అయినట్లు తేలిందని అధికారులు తెలిపారు. రెండురోజుల్లో సర్వేకు సంబంధించిన మ్యాపులు, హద్దుల పాయింట్లతో పూర్తి వివరాలు అందిస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి షరీఫ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

14గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

వాజేడు, సెప్టెంబరు 5: మండలంలో 14 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం అర్ధరాత్రి వెంకటాపురం(నూగూరు) మండలంలోని యోగితా నగర్ సమీపంలో పిడుగులతో కూడిన భారీ వర్షం పడి మూడు ఇన్సులేటర్లు దెబ్బ తిన్నాయి. దీంతో మండలానికి విద్యుత్ సరఫరాను అందించే 33 కేవీ విద్యుత్ లైన్‌కు సరఫరా నిలిచి పోయింది. సమాచారం అందుకున్న ములుగు విద్యుత్ శాఖ డీఈ పులసం నాగేశ్వరరావు సిబ్బందితో మరమ్మతు చేయించి పునరుద్ధరించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 5: షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎమ్డీ అమ్జద్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులోని కెనరా బ్యాంకు ఎదుట రైతులతో కలిసి ఆందోళనకు దిగారు. బ్యాంకు అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ఆధార్‌లో తప్పులు, రేషన్‌కార్డు లేదనే కారణాలు చూపుతూ మాఫీ చేయకపోవడం సరికాదన్నారు. పహానీ నకల్ ఆధారంగా కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వాంకుడోత్ సమ్మయ్య, భూక్యా పరమ్‌సింగ్, సాంబునాయక్, వెంకట్‌రెడ్డి, రమేష్, కొమ్మాలు, మహేందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

గోవిందరావుపేట, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల రైతులకు నష్టపరిహారం చెల్లించాలి సీపీఎం మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆగిరెడ్డి మాట్లాడుతూ వారం రోజులుగా కురిసిన వర్షాలకు దయ్యాలవాగు, గుండ్లవాగు, చల్లఒర్రెలను ఆనుకుని ఉన్న పంట పొలాలు మునిగిపోయి ఇసుకమేటలు వేశాయన్నారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులతో సర్వే చేయించి ఎకరానికి రూ.30వేల నష్ట పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బీరెడ్డి సాంబశివ, గొంది రాజేష్, సోమ మల్లారెడ్డి, కడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

కాటారం, సెప్టెంబరు 5: మండల కేం ద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం బీజే పీ రాష్ట్ర నేత చల్ల నారాయ ణరెడ్డి సమక్షంలో పలు వురు పార్టీలో చేరారు. మహాముత్తారం మండలంలోని నల్లగుంటమీనాజీపేటకు చెందిన మాజీ సర్పంచ్ ముత్యాల రాజుతోపాటు ఐలయ్య, సమ్మయ్య, రఘు, నర్సింహారెడ్డి, చందు, అరవింద్, స్వామి తదితరులు తీర్థం పుచ్చుకున్నారు. వారికి నారాయణరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కాటారం, మహాముత్తారం మండల ఇన్‌చార్జిలు పిలమర్రి సంపత్, దుర్గం తిరుపతి, బీజేవైఎం మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్, గుగ్లోత్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట మహిళ బైండోవర్

మహదేవపూర్, సెప్టెంబరు 5 : మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన జనగాని సరోజనను తహసీల్దార్ ఎదుట గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన సరోజన భూ వివాదానికి సంబంధించి విషయంలో బైండోవర్ చేశామన్నారు.

రైతు ఆత్మహత్యలపై విచారణ

మల్హర్, సెప్టెంబరు 5 : మండలంలోని మల్లంపల్లి, పెద్దతూండ్ల, కుంభంపల్లి గ్రామాల్లో కొన్నేళ్ల క్రితం జరిగిన రైతు ఆత్మహత్యలపై గురువారం భూపాలపల్లి ఆర్డీవో మంగీలాల్ విచారణ చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు రైతు ఆత్మహత్యలపై తహసీల్దార్ రవికుమార్‌తో కలిసి ఆర్డీవో పునర్విచారణ చేపట్టారు. 2014 నుంచి 2018 వరకు ఆత్మహత్యలు చేసుకున్న రైతులు కుంభంపల్లి గ్రామానికి చెందిన వేమునూరి పోచయ్య, పెద్దతూండ్ల గ్రామానికి చెందిన కొలిపాక కొమురయ్య, మల్లంపల్లి గ్రామానికి చెందిన జింకల రవీందర్ ఇళ్లకు వెళ్లి అధికారులు విచారణ చేపట్టారు.